క్లుప్తంగా

ఇసుక తవ్వకాలు జరిపిన సంస్థపై కేసు

పెనమలూరు: చోడవరం ఇసుక క్వారీలో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేశారని సంస్థ యాజమాన్యంపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. చోడవరం ఇసుక క్వారీలో అనుమతులు లేకుండా జీసీ కేసీ ప్రాజెక్ట్స్ యాజమాన్యం ఇసుక తవ్వకాలు చేసింది. దీనిపై జాయింట్ ఇన్స్పెక్షన్ చేయగా అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసినట్లు గుర్తించారు. దీంతో ప్రభుత్వ వనరులు తరలించిన సంస్థ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా మైన్స్ జియాలజీ అధికారి టి.కొండారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంస్థ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలోని 1, 8, 14, 19వ వార్డుల్లో సోమవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పర్యటిస్తారని మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులకు చైర్మన్ వల్లభనేని సత్యనారాయణతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలు

ఉంగుటూరు: చెన్నై–కోల్‌కత జాతీయ రహదారిపై ఆత్కూరు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గన్నవరం మండలం అల్లాపురంకి చెందిన తేజవెంకట్, దావాజిగూడెంకి చెందిన నాగవంశీ, శేషు ముగ్గురు బైక్‌పై ఆత్కూరు నుంచి గన్నవరం వైపు జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వెళుతున్నారు. కనకదుర్గ గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. ఈ ఘటనలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని సమీపంలోని పిన్నమనేని ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ పైడిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోడవరంలో వివాహిత అదృశ్యం

పెనమలూరు: చోడవరం గ్రామంలో మహిళ అదృశ్యం అవ్వడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చోడవరం గ్రామానికి చెందిన ముదునూరు నాగరాణి (45) అదే గ్రామంలో రైస్‌మిల్లు వద్ద భర్త మురళి, కుమారుడితో ఉంటుంది. మరో కుమారుడు వెంకటేష్ యనమలకుదురులో కుటుంబ సభ్యులతో ఉంటాడు. కాగా నాగరాణికి గత కొద్దికాలంగా గొంతు వద్ద గడ్డలు రావడంతో చికిత్స పొందుతుంది. ఈ నెల 25వ తేదీన పెద్ద కుమారుడు వెంకటేష్ తల్లికి ఫోన్ చేయగా ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. సాయంత్రం వరకు ఆమె ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా జాడ తెలియలేదు. దీంతో కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు, రేపు చినకంచిలో ఆడికృత్తిక ఉత్సవాలు

నున్న(విజయవాడరూరల్): చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి దేవస్థానం చినకంచిలో వేంచేసి ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత కార్తికేయ స్వామివారికి సోమ, మంగళవారం ఆడికృత్తిక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ మొక్కపాటి శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సోమవారం సాయంత్రం భక్తులతో కావడి మోసి, గుడి చుట్టూ ప్రదక్షిణలు, స్వామివారికి అభిషేకాలు జరుగుతాయన్నారు. మంగళవారం ఉదయం స్వామివారికి సహస్ర నామార్చన నిర్వహించడం జరుగుతుంది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆషాఢ మాసం కృత్తిక నక్షత్రం పుట్టినరోజును పురస్కరించుకొని రెండు రోజులపాటు ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కృత్తిక నక్షత్రంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరు ముఖాలతో జన్మించారని తమిళనాడు రాష్ట్రంలో భక్తులు ఎంతో వైభవంగా నిర్వహించే ఈ ఉత్సవాలను నున్న గ్రామంలోని చినకంచిలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

సేవ, సహాయానికి మారుపేరుగా లయన్స్ క్లబ్‌లు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సేవ, సహాయానికి లయన్స్ క్లబ్‌లు మారుపేరుగా నిలుస్తున్నాయని డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(అడ్మిన్), విజయవాడ వెస్ట్ జోన్(లా అండ్ ఆర్డర్) ఇన్‌చార్జి టి.హరికృష్ణ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత నూతన కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం ఫిలిం చాంబర్ హాలులో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హరికృష్ణ హాజరై మాట్లాడారు. ప్రకృతిని కాపాడేందుకు మొక్కలు నాటడంతో పాటుగా మనిషి ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు, మందులను ఉచితంగా అందజేయడం వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ లయన్స్ క్లబ్ సభ్యులు పేద ప్రజలకు సహాయాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు.



భక్తజన కోలాహలం

ఇంద్రకీలాద్రిపై ఆదివారం భక్తజన కోలాహలం నెలకొంది. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి సారె సమర్పించేందుకు పెద్ద సంఖ్యలో భక్త బృందాలు ఆలయానికి తరలివచ్చారు. అరో అంతస్తులో సారె సమర్పించి, అమ్మవారిని దర్శించుకున్నారు. కనకదుర్గానగర్, పుష్కర ఘాట్, కొండపై భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











ఘనంగా శాకంబరీ ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని గంగాంభిక అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం శాకంబరీ ఉత్సవాలు కన్నులపండువగా నిర్వహించారు. అమ్మవారి గర్భాలయం, ఆలయ ప్రాంగణం మొత్తం రకరకాల కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. శాకంబరీ అమ్మవారికి విశేష పూజలు చేశారు. పసుపు, కుంకుమ, పిండి వంటలతో అమ్మవారికి సారె సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు నందూరు సత్య వెంకటేశ్వర శర్మ, నక్కా బాబు, కొల్లి వెంకట రంగారావు, పుట్టి రాంబాబు, పుట్టి కోటేశ్వరరావు, వీర్రాజు పాల్గొన్నారు.



పెరికీడులో శాకంబరీదేవిగా గంగాంభిక అమ్మవారు

విద్యార్థులకు ఉపకార వేతనాలు

ఉయ్యూరు: విద్యాభ్యున్నతికి తుమ్మూరు ట్రస్టు సేవలు అభినందనీయమని బోళ్లపాడు ఎంపీటీసీ సభ్యుడు, మాజీ ఎంపీపీ తుమ్మూరు గంగారత్నం అన్నారు. మండలంలోని బోళ్లపాడు గ్రామంలో తుమ్మూరు పిచ్చిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థులకు రూ. 1.15 లక్షల ఉపకార వేతనాలను ఆదివారం అందజేశారు. ట్రస్టు కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గంగారత్నం మాట్లాడుతూ గ్రామంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయడంతో పాటు గ్రామాభివృద్ధికి తుమ్మూరు పిచ్చిరెడ్డి ట్రస్టు సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు. ట్రస్టు చైర్మన్ తుమ్మూరు నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ప్రతి సంవత్సరం గ్రామంలో విద్యార్థులందరికీ ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యకు ట్రస్టు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి

కానూరులో పేకాట శిబిరంపై దాడి

రూ 1.86 లక్షలు స్వాధీనం

పెనమలూరు: కానూరులో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు నవతా రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 14 మంది పట్టుబడ్డారు. వారి వద్ద రూ. 1.86 లక్షల సొమ్ము పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా పేకాట శిబిరాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రామారావు హెచ్చరించారు.

వణుకూరులో...

కాగా వణుకూరులో గత కొద్ది కాలంగా పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం టీడీపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు గత కొద్ది కాలంగా పేకాట నిర్వహిస్తున్నా పోలీసులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. సామాన్యులు పేకాట ఆడితే చర్యలు తీసుకునే పోలీసులు టీడీపీ నేతలు పేకాట శిబిరం నిర్వహిస్తే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

11 మంది జూదరులు అరెస్ట్

గన్నవరం: మండలంలోని సూరంపల్లిలో పేకాడుతున్న 11 మందిని జూదరులను గన్నవరం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు... గ్రామ శివారులో గత కొన్ని రోజులుగా పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది దాడిచేసి 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ. 4,130 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం జూదరులను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అధ్వానంగా బీబీగూడెం ఆర్‌అండ్‌బీ రహదారి

గన్నవరం రూరల్: మండలంలోని బీబీగూడెం రహదారి అధ్వానంగా ఉంది. గన్నవరం నుంచి ఆగిరిపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న బీబీగూడెం ఎంపీపీ స్కూల్ వద్ద పరిస్థితి దయనీయంగా మారింది. ఇదే మార్గంలో బీబీగూడెం ఎస్సీ కాలనీ చెరువు మలుపు వద్ద పరిస్థితి కూడా ఇబ్బందికరంగా ఉంది. రోజూ ఈ రహదారిపై వేలాది వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. ద్విచక్ర వాహనదారులు తరచూ పడిపోతున్నారు. లారీలు, బస్సులు కుదుపులతో అడుగు కదలాలంటే కదిలే వీలు లేకుండా గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలకు ఆ గోతుల్లో నీరు నిలిచిపోయి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఇదే మార్గంలో గోపవరపుగూడెం, చిక్కవరం గ్రామాల క్రాస్ రోడ్స్ దగ్గరలో కూడా రోడ్డు ఛిద్రమైంది. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం గ్రావెల్‌తో తాత్కాలికంగా అయినా గోతులు పూడ్చాలని కోరుతున్నారు.



బీబీగూడెం ఎంపీపీ స్కూల్ వద్ద రోడ్డుపై గోతులు

మధురంగా సాగిన యువ రాగం



విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో నెల వారీ యువరాగం కార్యక్రమంలో భాగంగా లబ్బీపేటలోని మహతి వేదికపై ఆదివారం యువ సంగీత కళాకారిణి పవిత్ర నిర్వహించిన గాత్ర కచేరీ మధురంగా సాగింది. వాగ్గేయకారులు రచించిన సంకీర్తనలు శ్రీ మహాగణపతిం, వందనము రఘునందన, సీతమ్మ మాయమ్మ, సరోజదళనేత్రి, అందము ఆనంద ఆనందము, నారాయణతే నమోనమో, శ్రీ రామ జయరామ, అప్పుదరకు కీర్తనలను మధురంగా గానం చేశారు. బీవీఎస్ శ్రీ కృష్ణ వయోలిన్‌పై, మృదంగంపై జగన్మోహిని సహకరించారు. శ్రీ సద్గురు సంగీత సభ కార్యదర్శి గౌరీనాథ్ మాట్లాడుతూ.. యువ సంగీత కళాకారులను ప్రోత్సహించడానికి ప్రతి నెల సంగీత కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ ఏడాది నవంబర్‌లో నగరంలో పెద్ద ఎత్తున సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధానా సంగీతోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, సంగీత విద్వాంసురాలు గాయత్రి గౌరీనాథ్ పాల్గొన్నారు.

తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు



విజయలక్ష్మికి పురస్కారం ప్రదానం చేస్తున్న సంతోష్, గాయకుడు శ్రీనివాస్ తదితరులు

విజయవాడ కల్చరల్: తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన గాయని ఎస్‌కే చిత్ర అని మురగా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు ఒమ్మి సంతోష్ నాయుడు అన్నారు. సూర్యారావుపేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం చిత్ర జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మికి చిత్ర సామాజిక సేవా పురస్కారం ప్రదానం చేశారు. సంతోష్ నాయుడు మాట్లాడుతూ.. చిత్ర తెలుగు పాటలకు ఆరు సార్లు జాతీయ అవార్డులను అందుకున్నారన్నారు. విజయలక్ష్మి మాట్లాడుతూ.. చిత్ర సినీ రంగ సేవలను గుర్తించి పద్మశ్రీ, పద్మభూషణ్‌లు అందించారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పి.వెంకన్న, పి.శ్రీనివాస్, శ్యాంప్రసాద్, చలపతిరావు, గాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీఅంకమ్మతల్లికి ఒడుగంటి బియ్యం సమర్పణ

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో ఆషాఢ మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆషాఢ మాసం నాల్గో ఆదివారం సందర్భంగా శ్రీ అంకమ్మతల్లికి ఒడుగంటి బియ్యం సమర్పించారు. తొలుత భక్తులు గ్రామ పొంగళ్లను ఊరేగింపుగా తీసుకువచ్చి శ్రీలక్ష్మీ తిరుపతమ్మకు నివేదించారు. అమ్మవారి సన్నిధిలో శ్రీలలితా సహస్ర నామ పారాయణం, శ్రీలక్ష్మీ అష్టోత్రం జరిగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలోని మాను (మహాలక్ష్మి)కి పూజలు నిర్వహించారు. శ్రీతిరుపతమ్మ సేవా సదన్ నిర్మాణానికి జాస్తి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన ముని మనవరాళ్లు కీర్తిశ్రీ చౌదరి, గ్రేష్మశ్రీ చౌదరి రూ. 50 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



శ్రీధర్‌కు విరాళం నగదు అందజేస్తున్న దాతలు

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాఢ మాసం సారె సమర్పించారు. బాపులపాడు మండలంలోని రంగయ్య అప్పారావు పేట, కానుమోలు, వేలేరు, బండారుగూడెం గ్రామాల్లో ఆదివారం ఆషాఢ సారె సమర్పణ ఘనంగా జరిగింది. ఆయా గ్రామాల్లో రామాలయం నుంచి అధిక సంఖ్యలో మహిళలు సారెలతో ప్రదర్శనగా గంగానమ్మ తల్లి దేవస్థానాలకు తరలివచ్చారు. జై దుర్గా.. నామస్మరణ చేస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారె సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు, మండల కన్వీనర్ తట్టి సుబ్బారావు, మహిళా సహ కన్వీనర్ కనకరత్నం, సభ్యుడు బొత్స వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రంగయ్య అప్పారావుపేటలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

పేరంటాలమ్మ సేవలో ఎమ్మెల్యే యార్లగడ్డ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం పురస్కరించుకుని ఎమ్మెల్యే యార్లగడ్డ, జ్ఞానేశ్వరి దంపతులు అమ్మవార్లను దర్శించుకుని సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు యార్లగడ్డకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం పసుపు, కుంకుమ, గాజులతో పాటు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ కొల్లా ఆనంద కుమార్, అద్దెపల్లి సాంబశివ నాగరాజు, నభిగాని కొండయ్య, మత్తె రాధాకుమార్, కళ్లెపల్లి సాయిరామరాజు, తంబాబత్తుల క్రాంతికుమార్, కొంగన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పేరంటాలమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు

ఉయ్యూరు ప్రజలకు తోడుగా ఉంటా

ఉయ్యూరు: ఉయ్యూరు ప్రజలకు ఎప్పుడూ తోడుగా ఉంటానని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. గన్నవరం నుంచి ఉయ్యూరు మీదుగా పమిడిముక్కల మండలం పెనుమత్స వెళ్తున్న వెంకట్రావ్‌కు ఆదివారం ఉయ్యూరులో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రధాన సెంటరులో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో పాటు గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే వెంకట్రావ్ మాట్లాడుతూ తాను పుట్టింది పెనుమత్సలో అయినా పెరిగింది, విద్యాభ్యాసం చేసింది ఉయ్యూరులోనే అన్నారు. ఉయ్యూరు ప్రజలతో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, నేరెళ్ల గుప్తా, మేడిశెట్టి మస్తాన్‌రావు, కనగాల నాని, తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో ఎమ్మెల్యేలు యార్లగడ్డ, బోడెకు స్వాగతం పలుకుతున్న అభిమానులు

ఏపీ ఎస్‌డబ్ల్యూఎస్‌ఏ నూతన కార్యవర్గం ఏర్పాటు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ స్టేట్ వైడ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్(ఏపీ ఎస్‌డబ్ల్యూఎస్ఏ)కు అనుబంధంగా విజయవాడ నగర కార్యవర్గం ఏర్పాటైంది. విజయవాడలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నగర అధ్యక్షుడిగా కొప్పుల శ్యామ్, ప్రధాన కార్యదర్శిగా హేమంత్ పూడి, ఉపాధ్యక్షులుగా రాధారెడ్డి, విఘ్నేశ్వరరావు, అక్బర్ సలీం షేక్, కోశాధికారిగా రాజ్‌కిరణ్‌లతో పాటు 19 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు సేవలు అందించడంలో ఓర్పు, సహనం వహించి వారి సమస్యల పట్ల సానుకూలంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందన్నారు. అదేవిధంగా అసోసియేషన్ సభ్యుల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాజీ షేక్, అడ్మిన్ సెక్రటరీలు స్టాలిన్, అర్చన, మోకా శివరామకృష్ణ, రాంబాబు, విఘ్నేశ్వరరావు పాల్గొన్నారు.



కదంబాల కనువిందు

కదంబ పుష్పాలు అంటే తెలియని వారు ఉండరు. కదంబంతో తయారు చేసే ప్రసాదాన్ని స్వీకరించేందుకు ప్రజలు అమితంగా ఇష్టపడతారు. అలాంటి కదంబ పుష్పాలు కంకిపాడు పరిసరాల్లో విరగకాస్తున్నాయి. వర్షాలు కురవటంతో పుష్పాలు వికసించాయి. అచ్చం బాల్ బ్యాడ్మింటన్ బంతులను పోలి ఉండే ఈ కదంబాలు చెట్ల నిండా విరగకాసి ప్రకృతి ఆరాధకుల్ని, భక్తులను ఆకట్టుకుంటున్నాయి. కంకిపాడు ప్రాంతంలో కనిపించిన కదంబ పుష్పాలను సాక్షి తన కెమెరాలో బంధించింది.

– కంకిపాడు



